# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్

2-7-2026

వెల: రూ.5/-


పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక:100

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఆగ్రహంతో రగిలిపోతున్న కోమటిరెడ్డి!



సీఎం రేవంత్ షో ఆఫ్ చేస్తున్నారంటూ


రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్

యాదాద్రి ట్రస్ట్ బోర్డు నియామకం పై అభ్యంతరం

ఇకనుంచి పట్టించుకోకూడదని సీఎం రేవంత్ నిర్ణయం



- మిగతా 2వ పేజీలో



# మంత్రిగా బాలయ్య!

## ఏపీ క్యాబినెట్లోకి నందమూరి బాలకృష్ణ

## చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ క్యాబినెట్ విస్తరణకు చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన తరుణంలో.. మంత్రివర్గ ప్రక్షాళన చేయాలన్నది చంద్రబాబు ఆలోచన. ప్రస్తుతం 24 మంది మంత్రులు ఉన్నారు.

- మిగతా 2వ పేజీలో

# తమిళనాడులో విష్ణు రెడ్డి కలకలం!

క్యాబినెట్ భేటీకి హాజరు

డిజిపి కి డీఎంకే ఫిర్యాదు

విజయ్ సర్కార్ కు షాక్



2లో



# రేవంత్ 'మెగా' వ్యూహం!



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు నియామకం ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో సెగలు రేపుతోంది. ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ప్రధానంగా మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖకు ఈ బోర్డులో సభ్యురాలిగా చోటు కల్పించడం హాట్ టాపిక్ అవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి మార్కు వ్యూహం ఇప్పుడు రాజకీయ పండితులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

## యాదాద్రి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా కొణిదల సురేఖ

## ముఖ్యమంత్రి మార్క్ స్ట్రాటజీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** ఇది కేవలం ఒక ఆలయ కమిటీ నియామకం మాత్రమే కాదు. దీని వెనుక బలమైన రాజకీయ, సామాజిక సమీకరణలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**నూతన బోర్డు నియామకం..**

ఏపీకి తిరుపతి మాదిరిగా.. తెలంగాణకు యాదాద్రి ఆలయాన్ని పరిగణిస్తారు. ఆ ఆలయ అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. అందులో భాగంగా ప్రముఖ ఫార్మా దిగ్గజం ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి కి బోర్డు చైర్మన్గా బాధ్యతలు కట్టబెట్టారు.

- మిగతా 2వ పేజీలో



3లో

# మూడు రాజధానులకు గుడ్ బై!

వచ్చే ఎన్నికలు మావిగన్ అజెండా తోనే

తేల్చి చెప్పిన వైసీపీ అధినేత జగన్

ఆందోళనలో ఆ పార్టీ శ్రేణులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికలకు అజెండా సిద్ధం చేసుకున్నారు. వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని తేల్చేశారు. ప్రజల మద్దతు ఎవరికి ఉంటుందో చూసుకుందాం అంటూ ప్రకటన చేశారు. తాడేపల్లి లో వారాంతపు ప్రెస్మీట్లో మాట్లాడారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్ర రాజధాని విషయంలో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. మావిగన్ రాజధాని అభివృద్ధికి



# జూనియర్ ఎన్టీఆర్తో లోకేష్ దోస్తీ!

సానుకూల ప్రకటనలు చేస్తున్న టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్

భవిష్యత్తులో కలిసి పనిచేసేందుకు ఇద్దరు నిర్ణయం

గతంతో పోల్చుకుంటే తగ్గిన గ్యాప్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** జూనియర్ ఎన్టీఆర్ నారా లోకేష్ తో రాజీ చేసుకున్నారా? ఆ ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు పెరుగుతున్నాయా? భవిష్యత్తులో కలిసి పనిచేసే పరిస్థితి ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత కొంతకాలంగా నారా లోకేష్ చేస్తున్న ప్రకటనలు అలానే ఉన్నాయి. నందమూరి హరికృష్ణ విషయంలో ఆయన గొప్పగా ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను ప్రదర్శించి

- మిగతా 2వ పేజీలో

# అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత

సిఎం రేవంత్తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి

అన్లాగ్ సిఇవో అలెక్స్ కిప్మాన్



3లో



# పెద్దిరెడ్డి వర్సెస్ చెవిరెడ్డి!

సీనియర్ నేతల మధ్య కోల్డ్ వార్

వైసీపీలో రోజురోజుకు పెరుగుతున్న విభేదాలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత

2లో

# ఏపీకి భారీగా రాబడి!

రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

దేశంలోనే రెండో స్థానంలో మన రాష్ట్రం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జాతీయస్థాయిలో ఏపీ సరికొత్త రికార్డు సృష్టించింది. ఆర్థిక వృద్ధిలో మైలురాయిని అధిగమించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జూన్ నెలలకు సంబంధించిన జిఎస్టి వసూళ్లలో




3లో

# ఆగ్రహంతో రగిలిపోతున్న కోమటిరెడ్డి!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బాహటంగానే మళ్లీ విమర్శలు చేయడం ప్రారంభించారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న వారికి కనీసం విలువ లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒరిజినల్ కాంగ్రెస్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఇతర పార్టీల నుంచి చేరిన వారికి కాంగ్రెస్ లో పదవులు కట్టబెడుతున్నారు అంటూ చెప్పుకొచ్చారు. అయితే కోమటిరెడ్డి సైతం బిజెపి నుంచి వచ్చారన్న విషయాన్ని మాత్రం మరిచిపోతున్నారు. గత కొంతకాలంగా మంత్రి పదవి దక్కలేదని అసంతృప్తిగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నల్గొండలో జరిగిన సీఎం రేవంత్ సభకు సైతం మొకం చాటేసారు. ఈరోజు మీడియా ముందుకు వచ్చి సీఎం రేవంత్ తీరుపై విమర్శలు చేశారు.



సంచలన ఆరోపణలు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షేత్రస్థాయి పనికంటే కేవలం షో ఆఫ్ చేయడమే ఎక్కువైంది అంటూ సంచలన ఆరోపణలు చేశారు. భువనగిరి జిల్లాలో తాను కీలక నేతగా ఉన్నప్పటికీ.. తన పరిధిలోని యాదాద్రి దేవస్థానం బోర్డు నియామకాల విషయంలో కనీస సమాచారం ఇవ్వకపోవడం పై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిన్న కాక మొన్న కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు ఇస్తూ.. వారి పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. సీఎం ఏకపక్ష వైఖరి నచ్చక తాను నల్గొండలో అధికారిక సభకు హాజరు కాలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీసింది. మంత్రి పదవి ఇవ్వరన్న క్లారిటీతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రేవంత్ రెడ్డి సైతం రాజగోపాల్ రెడ్డి విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఎంతవరకు ప్రాధాన్యత ఇవ్వాలో అంతవరకు ఇస్తున్నారు. గతంలో పార్టీ మారిన చరిత్ర ఉన్నందున.. రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్ హై కమాండ్ పెద్దగా పరిగణలోకి తీసుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది. సొంత నియోజకవర్గంలో సైతం రాజగోపాల్ రెడ్డికి పట్టు సడలుతోందని.. ఆయన విషయంలో పట్టించుకోవాల్సిన పనిలేదని సీఎం రేవంత్ సైతం ఒక నిర్ణయానికి వచ్చారని సమాచారం. తన సభకు గైర్హాజరైన రాజగోపాల్ రెడ్డి విషయంలో ఇకనుంచి కఠినంగా ఉండాలని కూడా రేవంత్ డిసైడ్ అయినట్లు ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో...

# మంత్రిగా బాలయ్య!

వీరిలో చేర్పులు మార్పులు చేయడం ద్వారా కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రముఖంగా ఈసారి నందమూరి బాలకృష్ణ పేరు వినిపిస్తోంది. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా నందమూరి అభిమానుల అభిమానాన్ని సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. వరుసగా మూడుసార్లు గెలిచిన బాలకృష్ణ కు పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. అది ఎట్టకేలకు తీరనుంది.

**ఎన్టీఆర్ వారసుడిగా..**

సినిమా రంగంలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు నందమూరి బాలకృష్ణ. నందమూరి తారక రామారావు నట వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన బాలకృష్ణ.. రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర చాటుకున్నారు. 2014 ఎన్నికల్లో తొలిసారిగా హిందూపురం నుంచి పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ సమయంలో నేను నందమూరి బాలకృష్ణ పేరును మంత్రిగా పరిశీలనలోకి తీసుకుంటారని ప్రచారం జరిగింది. కానీ వివిధ సమీకరణలో భాగంగా ఆ అవకాశం చిక్కలేదు. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం బాలకృష్ణ భారీ మెజారిటీతో గెలిచారు. రాయలసీమ నుంచి ముగ్గురు గెలవగా... అందులో నందమూరి బాలకృష్ణ ఒకరు కావడం విశేషం. 2024 ఎన్నికల్లో సైతం బాలకృష్ణ హిందూపురం నుంచి గెలిచారు. హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. తప్పకుండా ఈసారి మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ వివిధ సమీకరణలో ఛాన్స్ దక్కలేదు.

## నందమూరి కుటుంబానికి ప్రాధాన్యం..

నందమూరి కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యం లభించడం లేదన్న ఆవేదన అభిమానుల్లో ఉంది. అందుకే బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా వారిలో ఒక రకమైన అభిమానం నింపాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. మరోవైపు మంత్రిగా నారా లోకేష్ ఉన్నారు. ఇప్పుడు ఆ కుటుంబంలో మూడో వ్యక్తిగా నందమూరి బాలకృష్ణకు అవకాశం కల్పిస్తే.. ఇబ్బందికర పరిస్థితులు వచ్చే అవకాశం ఉంది. కానీ నందమూరి బాలకృష్ణ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని.. క్యాబినెట్లో చోటిచ్చే అవకాశం ఉంది. మరి ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# తమిళనాడులో విష్ణు రెడ్డి కలకలం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం. అక్కడ సరికొత్త వివాదం ఒకటి తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన అధికారిక క్యాబినెట్ సమావేశాలు ఎలాంటి ప్రభుత్వ పదవులు లేని ప్రైవేటు వ్యక్తులు పాల్గొనడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది.. విజయ్ కు అత్యంత సన్నిహితులుగా పేరున్న విష్ణు రెడ్డి, జాన్ ఆరోగ్య స్వామి నేరుగా మంత్రివర్గ సమావేశాలకు హాజరుకావడంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంలో అధికారిక హోదా లేని వ్యక్తులు క్యాబినెట్ నిర్ణయాల్లో భాగస్వాములు కావడం ఏంటనే ప్రశ్నా ఉత్పన్నమవుతోంది.

**ప్రత్యేక ఛాంబర్లు..**

రెండు నెలల పాలన పూర్తి చేసుకున్నారు విజయ్. అయితే సచివాలయంలో ముఖ్యమంత్రి విజయ్ ఛాంబర్ పక్కనే ఈ ఇద్దరు నేతలకు ప్రత్యేకంగా ఛాంబర్లు కేటాయించారని ఆరోపణలు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఎలాంటి రాజ్యాంగబద్ధమైన, ప్రభుత్వపరమైన పదవులు లేనప్పటికీ.. వారు అక్కడి నుంచే సమాంతరంగా ప్రైవేటు పాలన సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఫైల్లు, కీలక నిర్ణయాలు వీరి కనుసన్న లోనే జరుగుతున్నాయంటూ సచివాలయ వర్గాల్లో ఒక ప్రచారం అయితే ఉంది. ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం డిఎంకె తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ రహస్యాలు, అధికారిక విషయాలు లీక్ అయ్యే ప్రమాదం ఉందంటూ ఏకంగా రాష్ట్ర డిజిపి కి డీఎంకే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది డిఎంకె. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ఇలాంటి రాజ్యాంగేతర శక్తుల జోక్యం పెరిగిపోవడం విజయ్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**ప్రభుత్వ సలహాదారుగా ఉంటూ..**

అయితే ఇప్పటికే విష్ణు రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ఏపీకి చెందిన విష్ణు రెడ్డి విజయ్ కుమార్ అత్యంత సన్నిహితంగా ఉంటూ వచ్చారు. ఈయన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి సమీప బంధువు. ఆయన సొంత ఊరు అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలోని ఎర్రదొడ్డి పల్లె. గత కొంతకాలంగా గ్రానైట్ వ్యాపారం చేస్తూ చెన్నై వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. విజయ్కు అత్యంత సన్నిహితుల్లో ఒకరు. మొన్నటి ఎన్నికల్లో యాక్టివ్ గా పని చేశారు. అందుకే ఆయనకు ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చారు. అయితే ఏకంగా మంత్రివర్గ సమావేశాలకు అనుమతి ఇవ్వడం ఇప్పుడు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది విజయ్ కు. దీనిపై దళపతి సర్కార్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# రేవంత్ 'మెగా' వ్యూహం!



కార్పొరేట్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న ఆయన నాయకత్వంలో ఆలయంలో మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే బోర్డులో ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, విజయరాజం, తుళ్ళ విజయేందర్, ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంఠమనేని, ఎం రాఘవేంద్రరావు, డి లక్ష్మీనారాయణ నాయక్ వంటి వివిధ రంగాల ప్రముఖులకు స్థానం కల్పించారు.

**ఆమె ఎంపిక వెనుక..**

అయితే ఈ బోర్డులో సభ్యుల నియామకం వేరు.. కొణిదల సురేఖ నియామకం వేరు. చిరంజీవి కుటుంబానికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రేజ్ గురించి చెప్పనవసరం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతుంది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవితో పాటు ఆయన కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. సురేఖకు పదవి ఇవ్వడం ద్వారా ఆ బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నట్లు అయింది. చివరిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే చిరంజీవి తన పొలిటికల్ కెరీర్ను ముగించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు చిరంజీవిని తమవాడిగా చూసుకుంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో సురేఖకు పదవి ఇవ్వడం ద్వారా లక్షలాదిమంది మెగా అభిమానుల అభిమానాన్ని పొందాలని రేవంత్ అంచనా వేస్తున్నారు. అయితే కేవలం సురేఖ సెలబ్రిటీ మాత్రమే కాదు. తెర వెనుక అనేక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందుకే ఆమెను ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# పెద్దిరెడ్డి వర్సెస్ చెవిరెడ్డి!



సన్నిహితులుగా ఉన్న ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు కోల్డ్ వార్ ప్రారంభమైనట్లు ప్రచారంలో ఉంది. ఇద్దరూ జగన్మోహన్ రెడ్డికి బాగా కావాల్సిన వారే. దీంతో ఎవరిని సముదాయించాలో.. ఎవరిని ప్రోత్సహించాలో తెలియని పరిస్థితి. రోజురోజుకు పరిస్థితి నివురు గప్పిన నిప్పులా మారుతోందని తాడేపల్లి పాలస్ వర్గాలు చెబుతున్నాయి.

**జగన్ చుట్టూ సన్నిహితులు..**

జగన్మోహన్ రెడ్డి చుట్టూ అతి కొద్ది మంది సన్నిహితులు మాత్రమే ఉంటారు. ప్రధానంగా అప్పట్లో విజయసాయిరెడ్డి అన్ని తానై వ్యవహరించేవారు. అటు తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి, వై వి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి లాంటి వారు వచ్చి చేరారు. అయితే గత ఎన్నికలకు ముందు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఈ టీంలోకి వచ్చారు. అయితే జగన్మోహన్ రెడ్డికి దగ్గరవుతున్న క్రమంలో ఈ ముఖ్య నేతల మధ్య విభేదాలు ఉన్నట్లు ప్రచారంలో ఉండేది. తాజాగా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మధ్య విభేదాలు తెరపైకి వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటివరకు జగన్మోహన్ రెడ్డి వద్ద పెద్దిరెడ్డి హవా నడిచింది. కానీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎంట్రీ ఇచ్చిన తర్వాత పెద్దిరెడ్డి పై జగన్మోహన్ రెడ్డిలో అనుమానం ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. దీని వెనుక చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హస్తం ఉన్నట్టు పెద్దిరెడ్డి వర్గం అనుమానిస్తోంది.

**పట్టు నిలుపుకుంటూ..**

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్. చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం రాజకీయాలు చేస్తూ వచ్చారు. ఒక వైపు నల్లారి కుటుంబంతో.. ఇంకోవైపు చంద్రబాబుతో తలపడుతూ సుదీర్ఘకాలం రాజకీయాలు చేశారు. జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి పెద్దిరెడ్డి గెలుస్తూ వస్తున్నారు. ఆయనతోపాటు కుమారుడు పెద్దిరెడ్డి మిధున రెడ్డి సైతం రాజంపేట నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి సైతం ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. బలమైన కుటుంబ నేపథ్యంతో.. బలమైన నాయకుడిగా ఎదిగిన పెద్దిరెడ్డికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి ఫ్యామిలీ మొత్తం గెలిచి తన సత్తాను చాటుకుంది. అయితే మద్యం కుంభకోణంతో పాటు తనపై నమోదవుతున్న కేసుల దృష్ట్యా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి పొలిటికల్ గా సైలెంట్ అవుతున్నారు.

లి పెరుగుతున్న ప్రాబల్యం..

మరోవైపు జగన్మోహన్ రెడ్డి వద్ద చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రాబల్యం పెరుగుతోంది. రకరకాల సర్వేల పేరుతో జగన్మోహన్ రెడ్డి ఆయనకు దగ్గరవుతున్నారు. ఈ క్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అనేక అనుమానాలు పెంచేలా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దిరెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. పార్టీలో చెవిరెడ్డి ఉంటే పని చేయనని తేల్చి చెప్పినట్లు సమాచారం. గత కొంతకాలంగా వైసీపీకి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు పెద్దిరెడ్డి ఫ్యామిలీ. మరి ఈ విభేదాల పర్వాన్ని జగన్మోహన్ రెడ్డి ఎలా చెక్ పెడతారో చూడాలి..

# జూనియర్ ఎన్టీఆర్‌తో లోకేష్ దోస్తీ!

మరి తన సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. దీంతో నారా లోకేష్ తో జూనియర్ ఎన్టీఆర్ కు ఉన్న గ్యాప్ క్రమేపి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ జూనియర్ ఎన్టీఆర్ తెలుగుదేశంలోకి వస్తే కలిసి పని చేస్తామని కూడా లోకేష్ తేల్చి చెబుతున్నారు. రెడ్ కార్పెట్ పరుస్తామని కూడా చెప్పుకొస్తున్నారు.

**గతంలో పార్టీకి ప్రచారం..**

లోకేష్ కంటే ముందుగానే పార్టీ కోసం పని చేసేందుకు ముందుకు వచ్చారు జూనియర్ ఎన్టీఆర్. 2009 ఎన్నికల్లో పార్టీ కోసం ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రచారం చేశారు. ఈ క్రమంలో ప్రమాదానికి కూడా గురయ్యారు.. జూనియర్ ఎన్టీఆర్ విషయంలో చంద్రబాబు సైతం చాలా ఆసక్తిగా ఉండేవారు. ప్రోత్సాహం అందించారు. జూనియర్ ఎన్టీఆర్ సిఫారసు తోనే 2004లో టికెట్ పొందారు కొడాలి నాని. 2009లో ఎంపీ సీటును దక్కించుకున్నారు వల్లభనేని వంశీ మోహన్. కానీ 2009 ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాలతో తీవ్ర కలత చెందారు జూనియర్ ఎన్టీఆర్. అలా పార్టీకి దూరమయ్యారు. మరోవైపు నందమూరి హరికృష్ణ వైఖరి సైతం ఆ కుటుంబంలో



విభేదాలు రావడానికి కారణం. 2014 ఎన్నికలకు ముందు సమైక్యాంధ్రకు మద్దతుగా రాజీనామా చేశారు నందమూరి హరికృష్ణ. కనీసం చంద్రబాబుకు చెప్పకుండా అలా చేసినందుకు తెలంగాణ వ్యతిరేక ముద్రను పొందాల్సి వచ్చింది. ఆ క్రమంలోనే నందమూరి హరికృష్ణ చంద్రబాబుతో విభేదించడం ప్రారంభించారు. దాంతో జూనియర్ ఎన్టీఆర్ సైతం చంద్రబాబుతో పాటు బాలకృష్ణకు దూరమయ్యారు.

**ఆ పరిణామాలతో..**

2019 తర్వాత జరిగిన పరిణామాలతో జూనియర్ ఎన్టీఆర్ టిడిపికి దాదాపు దూరమయ్యారు. ఆయన సన్నిహితులుగా భావించే కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ వ్యవహార శైలిని కనీసం నియంత్రించలేదు. అప్పట్లో నారా భువనేశ్వరి పై వ్యక్తిగత విమర్శలు చేసిన క్రమంలో జూనియర్ ఎన్టీఆర్ స్పందన టిడిపి శ్రేణులను నిరాశపరిచింది. మరోవైపు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు విషయంలో కూడా జూనియర్ ఎన్టీఆర్ స్పందన ఎంత మాత్రం మింగుడు పడలేదు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకలకు సైతం ఆయన దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబుతో పూర్తిగా గ్యాప్ ఏర్పడింది. బాలకృష్ణ తో పాటు నారా లోకేష్ కు దూరంగా ఉంటూ వచ్చారు జూనియర్ ఎన్టీఆర్. కానీ ఇటీవల క్రమేపి మార్పులు వస్తున్నాయి. నారా లోకేష్ నందమూరి హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ విషయంలో సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సైతం చంద్రబాబు తో పాటు లోకేష్, బాలకృష్ణ జన్మదినం నాడు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ క్రమంలో వారి మధ్య గ్యాప్ తగ్గిందని.. భవిష్యత్తులో లోకేష్ తో పని చేసేందుకు జూనియర్ ఎన్టీఆర్ సైతం మానసికంగా సిద్ధంగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.



## రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్,జూలై1: రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ, మరోవైపు మూసీ ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత అన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అజెండా మారుస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత సూచించారు.





# ఏపీకి భారీగా రాబడి!

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ఏకంగా 21 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. గత ఏడాది ఇదే నెలలో రూ.2591 కోట్లు ఉన్న ఆదాయం.. ఈ ఏడాది జూన్ నాటికి రూ.3144 కోట్లకు చేరుకుంది. దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లో గుజరాత్ 27% వృద్ధి తర్వాత.. అత్యధిక వృద్ధిరేటు సాధించిన రెండో రాష్ట్రంగా ఏపీ నిలిచింది. నిజంగా ఇది గుర్తించాల్సిన అంశం. ఎందుకంటే రాజధాని లేని నగరానికి ఈ స్థాయిలో ఆదాయం సమకూరడం గొప్ప విషయం.

**ప్రాజెక్టుల జోరు..**

రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇంకోవైపు అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. అమరావతి రాజధాని నగర నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తి చేయడం అత్యంత కీలకం. ఇప్పటికే ప్రారంభమైన మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక హక్కుల ఏర్పాటు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో పూర్తయితే.. రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం మారిపోనుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాత ఏపీ జీఎస్టి వసూళ్లు ఊహించని రీతిలో భారీగా పెరగనున్నాయి. నిర్మాణం, సేవల రంగం, వ్యాపార లావాదేవీలు ఊపందుకోవడంతో పాటు పారదర్శకమైన పన్నుల




వసూళ్ల వ్యవస్థ వల్ల రాష్ట్రానికి మరింతగా రాబడి పెరగనుంది.

**తెలంగాణతో పోల్చుకుంటే..**

ఇటీవల సీఎం చంద్రబాబు సంపద సృష్టి పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. జీఎస్టీ వసూళ్లలో ముందడుగు వేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ తరుణంలోనే ఈ నెలకు సంబంధించిన వసూళ్లలో భారీ పురోగతి కనిపించింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం జూన్ నెలలో పొరుగు రాష్ట్రమైన తెలంగాణ రూ.3994 కోట్ల పోస్ట్ సెటిల్మెంట్ జీఎస్టీ ఆదాయంతో.. 11% వృద్ధిని కనబరిచింది. అయితే ఏపీ ప్రస్తుత వేగాన్ని కొనసాగిస్తూ.. భవిష్యత్తులో జీఎస్టి వసూళ్ల పరంగా తెలంగాణను అధిగమించే అవకాశం ఉంది. ప్రణాళిక బద్ధమైన వ్యూహాలు, పారిశ్రామిక వృద్ధి ద్వారా అతి త్వరలోనే ఈ లక్ష్యాన్ని అధిగమిస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ వర్గాలు చెప్పుకొస్తున్నాయి.

# అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

హైదరాబాద్,జూలై1: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు.అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు.సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు.



## వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు.

**చిల్డ్రన్స్ స్పెషలిట్స్ డాక్టర్ ఎస్. అమరేందర్ను సన్మానించిన టిడిపి నాయకుడు వెంకటేష్, డాక్టర్స్, సిబ్బంది.**

**గండిపేట(క్రైం మిర్రర్):** వైద్యుల దినోత్సవ వేడుకలు రాజేంద్ర నగర్ నియోజకవర్గం లోని పలు ఆసుపత్రుల్లో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్బంగా వైద్యులను వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది వైద్యులను పుష్ప గుచ్చాలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆరాంఘర్ చౌరస్తా సమీపంలో రామయ్య హాస్పిటల్ లో చిన్నపిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. అమరేందర్ ను రంగారెడ్డి జిల్లా టిడిపి నాయకుడు ఎన్. వెంకటేష్ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా అయనకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా డాక్టర్ ఎస్. అమరేందర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో తాను కోనసాగడం, వ్యాధీ గ్రస్తులకు సేవలందించడం అదృష్టం గా భావిస్తున్నానన్నారు. తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదీవించడం వల్లనే తాను ఈ వైద్య వృత్తిలో రాణించడం జరిగిందన్నారు. ఈ వైద్యుల దినోత్సవం నాడు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# మూడు రాజధానులకు గుడ్ బై!



(మొదటి పేజీ తరువాయి)

తాము కట్టుబడి ఉంటామని ప్రకటించారు. కొద్ది రోజుల కిందట మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ.. మావిగన్ ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా వ్యతిరేకత వచ్చింది. అయినా సరే మావిగన్ కు కట్టుబడి ఉన్నట్లు ఆయన సంచలన ప్రకటన చేయడం విశేషం. అయితే దీనిపై రకరకాల చర్చ అప్పుడే మొదలైంది.

**ఎప్పటికప్పుడు స్టాండ్స్ మార్చుతూ..**

రాజధాని విషయంలో తరచూ స్టాండ్స్ మార్చుకుంటూ వస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. గతంలో టిడిపి ప్రభుత్వం అమరావతి ఏకైక రాజధానిగా ప్రతిపాదన చేసినప్పుడు తన సమ్మతిని తెలియజేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అన్నారు. విశాఖను పాలన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా చేస్తామని జగన్మోహన్ రెడ్డి హడావిడి చేశారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ మూడు రాజధానుల ముచ్చటను పక్కనపెట్టారు. కేవలం మావిగన్ చుట్టూనే రాజధాని కేంద్రీకృతమవుతుందని చెప్పడం.. యూటర్న్ తీసుకోవడమే అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తప్పకుండా ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ ప్రాంత ప్రజలకు జగన్మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**చేతులు కాల్చుకుంటున్న వైనం..**

ప్రస్తుతం అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. అయితే ఇప్పటికే అమరావతికి మద్దతుగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇంకా రాజధాని అంశం జోలికి వెళ్లి అనవసరంగా చేతులు కాల్చుకుంటున్నారని వైసీపీ శ్రేణులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల వ్యూహంలో భాగంగా కేవలం సెంటిమెంటును, ప్రాంతీయ వైరుధ్యాలను రెచ్చగొట్టేందుకే జగన్ ఇలా చేస్తున్నారని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూటమి అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టింది. తన పాలనలో మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి.. ఇప్పుడు కొత్తగా మావిగన్ అజెండాతో వస్తే ప్రజల నుంచి తిరస్కరణ ఖాయమని వైసీపీ నేతలు భయపడుతున్నారు. ఇప్పటికే రాజధాని అమరావతి ఎఫెక్ట్ వారికి తెలుసు. అయినా సరే తమ అధినేత అలా వ్యవహరిస్తుండడంతో చాలామంది నేతలు భయపడుతున్నారు.

# మిర్యాలగూడలో కఠిన నాకాబందీ

**150 వాహనాలపై కేసులు, 40 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చర్యలు**

**చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు**

**ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాల నడిపే వారిపై చర్యలు**

**సైలెన్సర్ల మార్పులతో అధిక శబ్దం సృష్టించిన వాహనదారులపై కేసులు**

**గంజాయి, జూదం, మట్కా, అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు**

**రాత్రివేళల్లో అనవసర సంచారం, బైక్ రేసింగ్‌లపై పోలీసుల హెచ్చరిక**

**దాబాలు, రెస్టారెంట్లు నిర్ణీత సమయానికి మూసివేయాలని సూచన**

**శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కోరిన పోలీసులు**





**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 1:** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు.మంగళవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలో ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు విస్తృత నాకాబందీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.తనిఖీల్లో ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సైలెన్సర్లలో మార్పులు చేసి అధిక శబ్దం చేయడం, నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, సరైన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై దాదాపు 150 వాహనాలపై కేసులు నమోదు చేశారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 40 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఎస్పీ తెలిపారు.అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించడం, బైక్ రేసింగ్‌లు, సైలెన్సర్ల మార్పులతో అధిక శబ్దాలు సృష్టించడం, గుంపులుగా తిరిగి ప్రజలకు భయాందోళన కలిగించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఆయన హెచ్చరించారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేసి మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గంజాయి, మట్కా, జూదం, అక్రమ మద్యం విక్రయాలు, రౌడీయిజం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ తెలిపారు. ఇకపై నిరంతర నాకాబందీలు, ప్రత్యేక తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతాయని పేర్కొన్నారు.పట్టణంలోని దాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, టీ స్టాళ్లు నిర్దేశిత సమయానికి తప్పనిసరిగా మూసివేయాలని సూచించారు. సమయానంతరం వ్యాపారాలు నిర్వహించడం లేదా అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం కల్పించడం గుర్తిస్తే యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ విస్తృత నాకాబందీలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఇన్స్పెక్టర్లు ఎం. నాగభూషణరావు, జె. సోమనర్సయ్య, పి.ఎన్.డి. ప్రసాద్, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావుకు ఘనంగా పదవీ విమరణ సన్మానం

**గండిపేట(క్రైం మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన నాగేశ్వరరావుకు బుధవారం అకాడమీలోని ఇంటర్నేషనల్ ఆఫీసర్స్‌మెన్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ముఖ్యఅతిథిగా హాజరై నాగేశ్వరరావును శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, బ్యాచ్‌మెట్లు, సహచర అధికారులు, అకాడమీ సిబ్బంది సమక్షంలో ఆయన పోలీస్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ 1991లో పోలీసు శాఖలో చేరిన నాగేశ్వరరావు నక్సలిజం తీవ్రంగా ఉన్న కాలంలో అత్యంత క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజల విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. 35 సంవత్సరాల సుధీర్ఘ పోలీస్ సేవలో నిజాయితీ, క్రమ శిక్షణ, అంకిత




భావంతో విధులు నిర్వహించి మంచి ఆరోగ్యంతో పదవీ విరమణ చేయడం అభినందనీయమని అన్నారు. అకాడమీలో గత తొమ్మిది నెలలుగా వివిధ శిక్షణా కార్యక్రమాలు, అధికారిక ఈవెంట్లు నిర్వహణలో ఆయన చూపిన నాయకత్వం, సమన్వయం ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో చేరిన తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. 35 సంవత్సరాలు పోలీస్ సేవలో పొందిన అనుభవాలు, సహచరుల సహకారం జీవితాంతం మరువలేనివని తెలిపారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో చివరి తొమ్మిది నెలలు సేవలందించడం తన ఉద్యోగ జీవితంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడిలు వెంకటేశ్వర్లు, కెఆర్‌కె ప్రసాద్, ఎడి నరహరి, డిఎస్‌పి ఆదూరి శ్రీనివాసరావు, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు జి.కవిత, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, వేముల శ్రీనివాస్‌రావు, వెంకట్రావు, ప్రతాప్, రాంకుమార్, జ్ఞానేంద్రరెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేక తనిఖీలు

**డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాలతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల విస్తృత తనిఖీలు**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ )** విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ డీసీపీ ట్రాఫిక్-III రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్. రాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో కలిసి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీస్ బ్రిలియంట్ హై స్కూల్, కాకతీయ ఈ-టెక్నో స్కూల్, పయనీర్ కాన్సెప్ట్ స్కూల్, సోలిటైర్ గ్లోబల్ స్కూల్ (దుర్గానగర్), ఆదిత్య హై స్కూల్, శ్రీ సాయి మోడల్ స్కూల్, విశ్వనాథ్ గ్రామర్



స్కూల్, ఎస్.హెచ్. హై స్కూల్, శ్రీ గాయత్రి టెక్నో స్కూల్‌లను సందర్శించి పాఠశాల బస్సుల డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తదితర వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అదేవిధంగా పాఠశాలల్లో నిర్దేశిత పార్కింగ్ స్థలాల లభ్యత, విద్యార్థులు బస్సుల్లో ఎక్కే, దిగే ప్రదేశాలు పాఠశాల ఆవరణలోనే ఉన్నాయా లేదా బయట ఉన్నాయా అనే అంశాలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, వాటి పనితీరు, పాఠశాల ప్రారంభం మరియు ముగింపు సమయంలో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను పాఠశాల సిబ్బంది సమర్థంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్. రాజు మాట్లాడుతూ విద్యార్థుల రవాణా భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, అన్ని ప్రైవేట్ పాఠశాలలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



## ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ !



ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టుంది. కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీ పథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజనకరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగల గాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది. కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పనిచేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. అలస్యమైతే పరిహారం ఇవ్వనున్నారు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మూడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు వివరాలను బహిరంగంగా వెల్లడించ నున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణపై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కొతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండనున్నాయి. ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.

## గుర్తింపు.. ఒక తీరని దాహం!

**పుట్టిన క్షణం నుంచి ఇల వీడే వరకు ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒక రూపంలో ఒకే ఒక్క అమూల్యమైన నిధి కోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉంటాడు. అదే తనను తాను గుర్తించమని, తన ఉనికికి ఒక విలువ ఇవ్వమని, కోట్లాది గొంతుకల్లో తన స్వరాన్ని కూడా వినమని చేసే ఆర్తనాదం. ఆకలి, నిద్ర, నివాసం వంటి ప్రాథమిక శారీరక అవసరాలు తీరిన తర్వాత మానవ మనస్సులో ఒక నిశ్శబ్ద తుఫానులా మొదలయ్యే అంతర్మథనం ఇదే గుర్తింపు కోసం ఆరాటం! ఇది కేవలం బాహ్య ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించడం కోసం మాత్రమే కాదు, అసలు నేనెవరు? శూన్యంలోంచి వచ్చిన నాకంటూ ఒక ప్రత్యేకత ఉందా? అనే శాశ్వత ప్రశ్నకు సమాధానం వెతుక్కునే ఒక అద్భుతమైన జీవిత ప్రయాణం.**

ఈ గుర్తింపు తపన అనేది వయసుతో వచ్చేది కాదు, మన రక్తంలోనే ప్రవహించే నైజం. ఒక చిన్న పిల్లవాడు తాను ఆడుకుంటున్న బొమ్మను గాల్లోకి ఎత్తి, కళ్ళల్లో అమాయకపు మెరుపుతో అమ్మా, చూడు! అని కేరింతలు కొట్టడం వెనుక ఉన్న మర్మం ఏంటి? ఒక విద్యార్థి అర్ధరాత్రి దాకా కంటిమీద కునుకు లేకుండా పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని కష్టపడటం వెనుక ఉన్న ప్రేరణ ఏంటి? అంతా ఆ గుర్తింపు కోసం చేసే నిరంతర ప్రయత్నాలే. తల్లిదండ్రుల ఆప్యాయత, గురువుల ప్రశంసలు, స్నేహితుల గుంపులో లభించే గౌరవం ఇవన్నీ మనిషి తన బాల్యంలోనే అన్వేషించే విభిన్న గుర్తింపు రూపాలు.కాలచక్రం తిరిగే కొద్దీ ఈ తపన మరింత సంక్లిష్టంగా, మరింత లోతుగా మారుతుంది. ఉద్యోగంలో ఆశించే పదోన్నతి, సమాజంలో కోరుకునే ఉన్నత స్థానం, కుటుంబంలో ఆశించే ఆత్మీయ గౌరవం ఇవన్నీ మానవ మనసులోని ఒకే ఒక మూల కోరిక యొక్క వేర్వేరు ముసుగులు మాత్రమే. జగత్ ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త అబ్రహాం మాస్లో ప్రతిపాదించిన మానవ అవసరాల శ్రేణి సిద్ధాంతంలో గుర్తింపు అనేది అత్యంత కీలకమైన మైలురాయి. శారీరక భద్రత, ప్రేమ లభించిన తర్వాత మనిషి తీవ్రంగా కాంక్షించేది తన అంతర్గత సామర్థ్యాన్ని, తన ఉనికి విలువను ఇతరులు గుర్తించాలనే. ఈ సహజసిద్ధమైన కోరిక తీరనప్పుడు, మనిషి అంతరంగంలో ఒక అగాధమైన శూన్యత ఏర్పడుతుంది. తాను దేనికీ పనికిరాననే నైరాశ్యం ఆవహిస్తుంది.

ప్రస్తుత ఆధునిక యుగంలో గుర్తింపు అనే పదానికి అర్థం పూర్తిగా మారిపోయింది. నేటి సమాజం దానిని కేవలం బాహ్య హంగులతో, ఆడంబరాలతో ముడిపెట్టి చూస్తోంది. చేతిలో ఉన్న డబ్బు, అనుభవిస్తున్న పదవి, సమాజంలో చెలామణి అవుతున్న పేరు, అన్నింటికీ మించి సామాజిక మాధ్యమాల్లో లభించే లైకులు, కామెంట్లు ఇవే నేటి గుర్తింపునకు కొలమానాలుగా మారాయి. ఈ డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరు పోస్ట్ చేసే ఫోటో వెనుక, పంచుకునే స్టేటస్ వెనుక ఒక నిశ్శబ్ద ప్రశ్న దాగి ఉంటుంది.ఈ ప్రపంచం నన్ను గమనిస్తోందా? నన్ను ఇష్టపడుతోందా?.ఈ సోషల్ మీడియా వేదికలు మనిషికి తక్షణమే లభించే అద్భుతమైన గుర్తింపును ఇస్తున్నట్లు భ్రమింపజేస్తాయి. కానీ, అవన్నీ కేవలం నీటి బుడగల లాంటి తాత్కాలిక సంతోషాలు మాత్రమే. ఒక లైక్ క్లిక్ చేసిన మరుక్షణమే ఆనందం కలుగుతుంది, కానీ ఆ నోటిఫికేషన్ల సందడి తగ్గగానే మళ్ళీ అదే శూన్యత, అదే ఒంటరితనం ముంచుకొస్తాయి. ఈ కృత్రిమ ప్రపంచం వల్ల మనుషులు నిరంతరం ఒకరితో ఒకరు పోల్చుకుంటూ, అంతులేని పోటీ అనే చక్రబంధంలో చిక్కుకుపోయి తమ మానసిక ప్రశాంతతను పూర్తిగా కోల్పోతున్నారు. ఇక్కడే మనల్ని మనం ఒక ముఖ్యమైన ప్రశ్న వేసుకోవాలి అసలైన గుర్తింపు అంటే ఏమిటి? అది ఇతరుల మెప్పుకోలుపై ఆధారపడి బతికేదా, లేక మన అంతరంగంలో మనమే కనుగొనేదా?

చరిత్ర పుటలను ఒక్కసారి వెనక్కి తిరగేసి, కాల గమనంలో చెరిగిపోని ముద్ర వేసిన గొప్ప వ్యక్తుల జీవితాలను గమనిస్తే ఒక పరమ సత్యం స్పష్టమవుతుంది. నిజమైన, శాశ్వతమైన గుర్తింపు ఎప్పుడూ లోపలి నుంచే ఉద్భవిస్తుంది. తాము చేసే పనిపై అచంచలమైన నమ్మకం, తాము నమ్మిన విలువల పట్ల కట్టుబడి ఉండే నిబద్ధత ఉన్నవారే చివరకు ఈ సమాజంలో చెరగని కీర్తిని సొంతం చేసుకున్నారు. వారు ఎన్నడూ గుర్తింపు కోసం, అవార్డుల కోసం ఆరాటపడి పనులు చేయలేదు. వారి పనిలో ఉన్న నిరుపమాన నాణ్యత, వారి అంతఃకరణలో ఉన్న నిజాయితీ మాత్రమే వారికి ప్రపంచస్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయి.దీనికి పూర్తి భిన్నంగా, కేవలం ఇతరుల ప్రశంసల కోసం, సమాజం మెచ్చుకోవాలనే తాపత్రయంతో బతికే వ్యక్తి జీవితంలో ఎన్నటికీ నిజమైన సంతృప్తిని పొందలేడు. ఎందుకంటే, బాహ్య గుర్తింపు అనేది పూర్తిగా ఇతరుల చేతుల్లో ఉండే ఒక రిమోట్ కంట్రోల్ లాంటిది. వారి మూడ్స్, వారి వ్యక్తిగత అభిప్రాయాలు మారిన మరుక్షణమే వారు ఇచ్చే గుర్తింపు కూడా మారిపోతుంది. కానీ లోపలి గుర్తింపు అలా కాదు! తనను తాను సంపూర్ణంగా అర్థం చేసుకోవడం, తన బలాలు మరియు బలహీనతలను స్పష్టంగా తెలుసుకోవడం, జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తన ఆత్మసాక్షికి కట్టుబడి జీవించడం ఇది మాత్రమే అత్యంత స్థిరమైనది, ఎప్పటికీ చెరిగిపోని శాశ్వతమైనది.గుర్తింపు కోసం సాగించే ఈ సుదీర్ఘ ప్రయాణంలో మనిషి తరచూ తీవ్రమైన ఒంటరితనానికి లోనవుతుంటాడు. తన రాత్రింబవళ్ళ శ్రమను ఎవరూ గుర్తించడం లేదని, తన త్యాగాలకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని లోలోపల కుంగిపోతుంటాడు. కానీ, ఈ వేదన భరిత ప్రయాణంలో ఒక అద్భుతమైన సూక్ష్మ సత్యం దాగి ఉంది. నిజమైన గుర్తింపు అనేది మనం సమాజం నుంచి ఎంత సంపాదించాము అనేదానిపై కాకుండా మనం ఈ సమాజానికి ఎంత తిరిగి ఇచ్చాము, ఎంతమంది జీవితాల్లో వెలుగులు నింపాము అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.ఒక నిస్వార్థ ఉపాధ్యాయుడు తాను తీర్చిదిద్దిన విద్యార్థుల హృదయాలలో ఎప్పటికీ సజీవంగా ఉంటాడు, ఒక మానవతావాది అయిన వైద్యుడు తాను కాపాడిన రోగుల ప్రాణాలలో, వారి కుటుంబాల కృతజ్ఞతలో నిలిచిపోతాడు,ఒక నిరపేక్షమైన తల్లి తన పిల్లల తీపి జ్ఞాపకాలలో శాశ్వతంగా జీవిస్తుంది. ఇలాంటి ఉన్నతమైన గుర్తింపునకు ఎలాంటి ఆర్భాటాలు, ప్రచారాలు అవసరం లేదు. అది ప్రకృతి నియమంలా స్వతహాగానే నడుచుకుంటూ వస్తుంది.గుర్తింపు కోసం మానవుడు చేసే ఈ అన్వేషణ అంతం లేని ఒక మహా సముద్రం లాంటిది. కానీ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో



మనం వెళ్లే దిశను కొద్దిగా మార్చుకుంటే, మన గమ్యస్థానం కూడా అద్భుతంగా మారుతుంది. ఇతరుల కళ్ళల్లో ఏదో గొప్పగా కనిపించాలనే వృథా తపనను, అహంకారాన్ని వదిలిపెట్టి మన అంతరాత్మకు, మనస్సాక్షికి నిజాయితీగా బతకాలనే ఉదాత్తమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే, ఈ జీవిత ప్రయాణం అలసటను కలిగించే భారం కాకుండా, అనుక్షణం ఆనందాన్ని పంచే అమృతధారగా మారుతుంది.జీవిత చరమాంకంలో మనల్ని మనం ప్రశ్నించుకున్నప్పుడు మిగిలేది ,మనకు సోషల్ మీడియాలో ఎన్ని వేల లైకులు వచ్చాయో, సమాజంలో ఎంతమంది మనల్ని పొగిడారో కాదు. మనం ఎంత నిజాయితీగా బతికామో, తోటి మనుషుల జీవితాల్లో ఎంతవరకు సంతోషాన్ని నింపామో అనేదే ముఖ్యం. అదే నిజమైన, శాశ్వతమైన, అత్యున్నతమైన గుర్తింపు. ప్రతి మనిషి ఈ అంతర్గత సత్యాన్ని తెలుసుకున్నప్పుడే, ఈ భూమిపై గుర్తింపు కోసం అతను చేసే ప్రయాణానికి ఒక సార్థకత, పరమార్థం లభిస్తాయి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

### పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి

### వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు

హైదరాబాద్: నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవం తంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రిం చడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నా యి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవం తంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డిని యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం చైర్మన్ గా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి ధన్యావాదములు

## ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త తౌర్ర విష్ణు నేత



**ఆత్మకూరు(ఎం),జూలై01/క్రైమ్ మిర్రర్:** మహబూబ్ నగర్ జిల్లాలోని గురుకుంట అనే చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించి కష్టపడి ఉన్నత చదువులు చదివి అంతర్జాతీయ ఫార్మా రంగంలో ఎన్నో విజయాలు స్వంతం చేసుకున్న పాలమూరు ముద్దుబిడ్డ , ఫార్మ దిగ్గజం , ఎం ఎస్ ఎన్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డికి యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం చైర్మన్ గా ప్రభుత్వం నియమించింది.నిత్యం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించే గొప్ప మానవతావాది డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డిని యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం చైర్మన్ గా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త తౌర్ర విష్ణు నేత ధన్యవాదాలు తెలిపారు . ఈ సందర్భంగా తౌర్ర విష్ణు మాట్లాడుతూ ఎం ఎస్ ఎన్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డి ఎంతో కష్టపడి ఎదిగిన వ్యక్తుల్లో ఒకరని మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఆయన మాలాంటి ఎంతోమందికి ఆదర్శమని అన్నారు . డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డి ప్రత్యక్షంగా 20 వేలకు పై చిలుకు మందికి , పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న గొప్ప వ్యక్తి అని గతంలో రెడ్డీస్ ల్యాబ్ లో వారితో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ గా డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డిని నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి , ఉత్తమ్ కుమార్ రెడ్డికి , కొండా సురేఖకి , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి , పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి , భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానానికి ధర్మకర్తలుగా నియామకం అయిన అందరికి పేరు పేరునా శుభాకాంక్షలు తెలిపారు .డాక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డి సారధ్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం కూడా అంతే స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు .



## చిన్నారుల అనాధ పుణ్యక్షేత్రంలో ఘనంగా మోహిత్ దాగా, లీషా దాగా వివాహ వార్షికోత్సవం



**ఎల్బీనగర్ జులై 1 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** వరంగల్ వాస్తవ్యులు మోహిత్ దాగా, లీశా దాగా వివాహ వార్షికోత్సవం సందర్భంగా అనాధ విద్యార్థుల పుణ్యక్షేత్రంలో చిన్నారులు కేక్ కట్ చేసి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం మరియు బిస్కెట్ల పంపిణీ నిర్వహించారు. కృష్ణ గోపాల్ సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మరియు సేవా సమితి సభ్యులు మోహిత్ దాగా, లీషా దాగా గార్లకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో వెదజిల్లాలని, వారు ఇలాంటి వార్షికోత్సవ శుభాకాంక్షలు మరెన్నో జరుపుకోవాలని, అనాధ పిల్లల పుణ్యక్షేత్రంలో చిన్నారులకు అల్పాహారము మరియు భోజన వితరణను నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## స్థానికులకు యాదగిరి శ్రీ లక్ష్మినరసింహస్వామి ట్రస్టు బోర్డులో అవకాశం లేకపోవడం విడ్డూరం

**బడా వ్యాపారవేత్తలకు,సీఎం రేవంత్ రెడ్డికి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ట్రస్టు బోర్డులో పేర్లా!**

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య**



**ఆత్మకూరు(ఎం),జూలై01/క్రైమ్ మిర్రర్:** కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ట్రస్టు బోర్డులో స్థానికులకు అవకాశం లేకపోవడం విడ్డూరమని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా వ్యాపార వేత్తలకు, సీఎం రేవంత్‌రెడ్డికి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ట్రస్టు బోర్డులో పేర్లు ప్రకటించారని విమర్శించారు. రాష్ట్రంలో అతి పెద్ద దేవాలయమైన యాదగిరీశుడి ఆలయ అభివృద్ధికి స్థానికులు ఎంతో మంది భూములు ఇచ్చారని, అంతే కాకుండా గత కొంత కాలంగా ట్రస్టు బోర్డులో చోటు వస్తుందని ఎంతో మంది స్థానికులు ఆశ పడ్డారన్నారు.కానీ స్థానికులకు చోటు కల్పించకుండా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. స్థానికులతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు సైతం చోటు లేకపోవడం బాధకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా, డబ్బులు అధికంగా ఉన్న వ్యక్తులకు మాత్రమే ట్రస్టులో చోటు ఉందని, దేవస్థానం అభివృద్ధిపై ఎలాంటి అవగాహన లేని వ్యక్తులను నియమించడం ఏమిటన్నారు.ఈ సమావేశంలో తోటకూరి బీరయ్య, ఒగ్గు బిక్షపతి, సిరికొండ సత్యనారాయణ, ఐలయ్య,తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి గ్రామంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే..





**క్రైమ్ మిర్రర్ కొందుర్గు :-** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు .అందులో భాగంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, మొదటగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ అవగాహన కార్యక్రమంలో (ఎస్ఐఆర్) పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రైతులకు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సీసీ రహదారుల నిర్మాణంతో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి. ప్రజాప్రతినిధులు, అధికారులు,

## 948.478 కిలోల గంజాయిని నిర్వీర్యం చేసిన జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ



**భద్రాద్రి కొత్తగూడెం జులై 01:** న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 07 కేసులకు సంబంధించిన 948.478 కిలోల గంజాయిని తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ఎం/ఎస్ ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ ప్రాంగణంలో పూర్తిగా నిర్వీర్యం చేసి బూడిద చేసినట్లు జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ రోహిత్ రాజు తెలిపారు. నిర్వీర్యం చేసిన గంజాయి విలువ సుమారు రూ.4 కోట్ల 74 లక్షలు ఉంటుందని తెలిపారు. నిర్వీర్య ప్రక్రియలో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేస్తున్నారని పేర్కొన్నారు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతూ గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నారని తెలియజేశారు.మాదక ద్రవ్యాల క్రయ విక్రయాల గురించి తెలిసినట్లయితే సమాచారాన్ని పోలీస్ వారికి అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ మెంబర్స్ కొత్తగూడెం సబ్ డివిజన్ డిఎస్పి ఆదినారాయణ, భద్రాచలం సబ్ డివిజన్ డిఎస్పి అరుణ్ కుమార్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోహింగ్యాలకు విద్యాసంస్థల్లో అడ్మిషన్లు

**సాక్ష్యాలతో నిరూపించిన శ్రీరాములు అందెల**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు, భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు నిరంజన్ యాదవ్ తో కలిసి యాకత్‌పురా నియోజకవర్గంలోని ఈదీ బజార్‌లో ఉన్న నూరియా జూనియర్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా రాయల్ కాలనీలో నివసిస్తున్న కొంతమంది రోహింగ్యాలకు సంబంధిత కాలేజీలో అక్రమంగా అడ్మిషన్లు కల్పించారని కాలేజీ సిబ్బందిని అడగగా వారు వివారాలను శ్రీరాములుకి అందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం సంబంధిత విద్యార్థులు పదవ తరగతి బోనఫైడ్ సమర్పించి కాలేజీలో అడ్మిషన్లు పొందినట్టు కాలేజ్ వారు వివరించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంఐఎం మాజీ కార్పొరేటర్ మరియు బీజేపీ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సంతోష్‌నగర్ సీఐతో పాటు పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు.


## మేడి స్వామికి జీవన్ రక్షక్ పురస్కారం-2026 అందజేత

**అవార్డు అందజేస్తున్న సినీ రాజకీయ నాయకులు డాక్టర్ బాబూమోహన్**



**ఆత్మకూరు(ఎం),జూలై01/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన యువ జర్నలిస్ట్ రక్త దాత మేడి స్వామికి హైదరాబాద్ రవీంద్రభారతిలో డాక్టర్స్ డే సందర్భంగా జీవన్ రక్షక్ పురస్కారం అవార్డు-2026 సినీ యాక్టర్ మాజీ ఎమ్మెల్యే రాజకీయ నాయకులు డాక్టర్ బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో రక్త దాతగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న విశేష సేవలను గుర్తుంచి.ఈ పురస్కారం చేసినట్లు మేడిది సుబ్బారావు ట్రస్ట్ మరియు పీపుల్ మీడియా పాయింట్ వారు తెలిపారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్...
# విద్యార్థులకు గణితం బోధన

హుజూర్ నగర్ గర్ల్స్ హైస్కూల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చాక్ పీస్ పట్టి విద్యార్థులకు లెక్కలు నేర్పిన వైనం

చదువుతో పాటు క్రమశిక్షణపై విద్యార్థులకు దిశానిర్దేశం

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ :** ఆయన జిల్లాకు బాస్.. నిత్యం ఫైళ్లు, సమీక్షలతో బిజీగా ఉంటారు. కానీ, ఒక్కసారిగా కలెక్టర్ తన హోదాను పక్కన పెట్టి లెక్కల మేస్టార్ అవతారమెత్తారు. చేతిలో చాక్ పీస్ పట్టుకుని బ్లాక్ బోర్డుపై లెక్కలు వేస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. బ్లాక్ బోర్డు వద్దకు వెళ్లి పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ నేరుగా తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. చదువు ఎలా సాగుతోంది? ఉపాధ్యాయులు సరిగ్గా వస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు గణితంలో ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా బ్లాక్ బోర్డు దగ్గరకు వెళ్లి విద్యార్థులకు లెక్కలు బోధించారు. కష్టమైన సూత్రాలను సులభంగా ఎలా గుర్తుంచుకోవాలో వివరించారు. కలెక్టర్ స్వయంగా పాఠాలు చెబుతుంటే విద్యార్థులు ఆసక్తిగా విన్నారు.

**అనుమానాలు నివృత్తి.**

కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ ఓపిగ్గా నివృత్తి చేశారు. చదువుపై ఏకాగ్రత ఉంచాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బడికి రావాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి డివిజనల్ అధికారి శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు శిక్ష

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ఫోక్సో కేసులో 23 ఏళ్ల యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శోభన్ తెలిపిన వివరాలు ప్రకారం ఇంస్టాగ్రామ్ ద్వారా మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న వెంకటస్వామి, వయస్సు 23, బాలికను ప్రేమ పేరుతో లైంగిక దాడికి పాల్పడ్డాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసుల ఆధారాలు పరిశీలించిన కోర్టు వెంకటస్వామిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 19 వేల జరినామ విధిస్తూ, బాధిత బాలికకు రెండు లక్షల పరిహారం అందించాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించారు.

## తెలంగాణ చీఫ్ సెక్రటరీని కలిసిన నరసింహ గౌడ్



**మునుగోడు జులై 1 :** తెలంగాణ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు ను హైదరాబాద్ లోని తన కార్యాలయంలో మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి భర్త పాలకూరి నరసింహ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు..



## కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహమేహరా

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా పరిగి సర్కిల్ లోని కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమేహెరా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి నేరాల వివరాలను ఎస్సై వి రమేష్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది యొక్క వ్యక్తిగత సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో పరిగి డిఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణ తప్పులు లేకుండా చేయాలి

ఇంటింటికి వెళ్లి 'సర్' కార్యక్రమం తనిఖీ

ఒకే కుటుంబం.. ఒకే పోలింగ్ కేంద్రం ఉండాలి

రెండు చోట్ల ఓటు ఉంటే ఒకటి తొలగిస్తాం

బిఎల్ఓలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం



**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బిఎల్ఓలను ఆదేశించారు. బుధవారం ఆయన హుజూర్ నగర్ పట్టణంలో జరుగుతున్న 'సర్' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు.

**ఎన్యుమరేషన్ పక్కాగా జరగాలి**

హుజూర్ నగర్ లో బిఎల్ఓలు ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. 2002 నాటి వివరాలకు, ప్రస్తుత వివరాలకు తేడాలను ఎలా గుర్తిస్తున్నారని ఆరా తీశారు. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారు? బిఎల్ఓలు ఫారాలు ఇచ్చారా? ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది? అని అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. బిఎల్ఓలు వెళ్లేటప్పుడే ఫామ్-6, 8 వెంట తీసుకెళ్లాలని సూచించారు.

**రెండు చోట్ల ఓటు ఉంటే కట్**

ఎవరికైనా రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే, వారు ఎక్కడ ఉండాలో ముందే నిర్ణయించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లేనిపక్షంలో రికార్డుల ఆధారంగా అధికారులే ఒక చోట ఓటును తొలగిస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక వ్యక్తికి రెండు ఓట్లు ఉండకూడదని సూచించారు. ప్రజలు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కొత్త ఓట్ల నమోదు, తప్పుల సవరణ కోసం ప్రజలు త్వరగా వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, బిఎల్ఓ లు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం



**ఆత్మకూరు(ఎం),జూలై01/క్రైమ్ మిర్రర్:** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేలశ్వర్లుతో పాటు డా. మాధవాచారి, డా. అహ్మద్ అలీ, డా. ఆదిల్, డా. శ్వేత ప్రియాంక, డా. నవీన్, డా. ఉదయ్ లను మరియు నర్సింగ్ సిబ్బందినివివేకానంద డివైన్ మోడల్ స్కూల్ వ్యవస్థాపకులు టి. మల్లికార్జున్,హెడ్‌మాస్టర్ వి.మల్లేష్ , ఉపాధ్యాయులు కె. నాగరాజు ,కె.సాయి మరియు విద్యార్థిని విద్యార్థులు డాక్టర్లని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు మల్లికార్జున్ మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యుల సేవలు అమోఘం. సమాజంలో వైద్యులు నిజమైన దేవుళ్లు. వారి త్యాగం, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం"అని కొనియాడారు.విద్యార్థినీ విద్యార్థులు వైద్యులకి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

## వనజీవి రామయ్య చూపిన బాటలో...
## పచ్చదనం పెంపొందిద్దాం...

గ్రీన్ భద్రాద్రి ప్రెసిడెంట్ రామకృష్ణ రెడ్డి.



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 01:** పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసి, లక్షలాది మొక్కలను నాటి "వనజీవి"గా చిరస్థాయిగా నిలిచిన పద్మశ్రీ లేట్ వనజీవి రామయ్య జయంతి సందర్భంగా భద్రాచలంలోని అభయాంజనేయ పార్కులో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కను నాటారు. ముందుగా వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం మొక్కలను నాటారు.ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "వనజీవి రామయ్య చూపిన హరితబాట ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం. ఆయన ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. భద్రాచలాన్ని సంపూర్ణ హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ భద్రాద్రి నిరంతరం కృషి చేస్తుంది. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వచ్ఛందంగా తీసుకోవాలి. మొక్కలు నాటడం ఒకరోజు కార్యక్రమం కాదు.. భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యత. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వనజీవి రామయ్య కలలుగన్న పచ్చని భద్రాచలాన్ని సాకారం చేయడమే గ్రీన్ భద్రాద్రి లక్ష్యం" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వృక్షమిత్ర అవార్డు గ్రహీత డాక్టర్ గొల్ల భూపతిరావు, గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి భూక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, భద్రాచలం వనజీవి సంపత్ శ్రీరంగం, పార్క్ కృష్ణ, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో బక్కారెడ్డి రైతులకు చేసిన సేవలు మరువలేనివి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు సీఈఓ బక్కారెడ్డి విధి నిర్వహణలో రైతులకు చేసిన మేలు మరువలేనివని పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, తాండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కేంద్రంలో పిఏసిఎస్ సీఈవో బక్కారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా బక్కారెడ్డిని ఘనంగా సన్మానించి వారు సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం కూడా సమాజానికి తమ అనుభవంతో సేవలందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డిసిసి ఉపాధ్యక్షులు బొలుసని భీమిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, వైస్ చైర్మన్ నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రవాణాలో నిబంధనలు పాటించాలి: సిఐ విద్యాసాగర్ రెడ్డి

ఆటోల్లో విద్యార్థుల అధిక రవాణాపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన

విద్యార్థుల భద్రతే లక్ష్యం.. ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల కౌన్సెలింగ్

సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థుల రవాణా చేస్తే చర్యలు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 01: భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ బీహెచ్ఈఎల్‌కు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులను ఆటోరిక్షాల్లో రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్లు, యజమానులకు ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆటోల్లో అనుమతించిన సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించవద్దని సూచించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు వివరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులను ఆటోల్లో తరలించినట్లు గుర్తిస్తే సంబంధిత డ్రైవర్లు, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ఆటో డ్రైవర్లు సమన్వయంతో వ్యవహరించాలని సిఐ విద్యాసాగర్ రెడ్డి సూచించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 గురువారం 2-7-2026

# ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలి

## ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయి నగర్ కాలనీలో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే



ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, రాజేష్ చంద్ర, పోశెట్టిగౌడ్, నవీన్ రెడ్డి, శ్రీధర్, తోట ప్రవీణ్, త్రినాథ్, సురభి రమేష్ రావు, సంతోష్ బిరాదర్, శేఖర్, రామరాజు, కృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం

**రామకృష్ణాపూర్, జూలై 1 (క్రైమ్ మిర్రర్) :** సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై జాడి శ్రీధర్ సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాల నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఆధార్ నంబర్లు తదితర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించొద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను తెరవకుండా, ఆన్‌లైన్ లావాదేవీలకు అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లనే వినియోగించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని చెప్పారు. త్వరగా ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన ఈవో కు ఘన సన్మానం

## బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్

**కుత్బుల్లాపూర్, జూలై 01 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ఈవో గా బాధ్యతలు చేపట్టిన సతీష్ నీ బుధవారం బి ఆర్ ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జై హిందు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. గతంలో ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కృష్ణమాచార్యులు ఆలయ అభివృద్ధి కోసం చేసిన కార్యక్రమాలను కొనియాడారు. ఆలయ అభివృద్ధి కోసం తీసుకునే ప్రతి నిర్ణయానికి తన మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ లు నరేందర్ రెడ్డి, సుధాకర్ రావు, నాయకులు. నరసింహారెడ్డి, రాయి విగ్నేష్, వేణు గౌడ్, మైలారం రాజు, సునీత, బత్తిని కళ్యాణ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్స్ డే సందర్భంగా హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో వైద్యులకు ఘన సత్కారం



**బాలానగర్, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్.ఎ.ల్ మెడికల్ సెంటర్‌లో మెడికల్ చీఫ్ డా. సుమంత్ చంద్ర ని, అలాగే డాక్టర్లు డా.యమున వాణి, డా. నిఖిల్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యునియన్ అధ్యక్షులు ఒ కన్వీనర్ వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ , కర్క నాగరాజు, జాయింట్ సెక్రటరీలు వడ్డే నాగార్జున , నాగరాజు గతదితరులు పాల్గొన్నారు. వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్ల సేవలను కొనియాడుతూ, వారి అంకితభావానికి హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు, డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు

## ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో పాల్గొన్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్

**కూకట్ పల్లి, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో ఆర్ పి కాలనీ జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్ బి ఎల్ ఓ శైలజ తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం-6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ కి సూచించారు. అనంతరం వరికుప్పల వాసుదేవ్ మాట్లాడుతూ18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి



ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం-6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఈ బాధ్యతను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తగా ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.



# కూకట్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

**కూకట్‌పల్లి, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి జూనియర్ కళాశాల సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, స్కూటీ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన కేసరి ఆనంద్ కుమార్ (60)కు మూసాపేట్ భవానీనగర్‌కు చెందిన జంగ్లి లక్ష్మి (50)తో గత కొన్నేళ్లుగా పరిచయం ఉంది. ఇటీవల అమీన్‌పూర్‌లోని ఓ హోటల్‌లో లక్ష్మి పనిలో చేరడంతో, ఆనంద్ కుమార్ ప్రతిరోజూ ఆమెను తన స్కూటీపై అమీన్‌పూర్‌కు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చేవారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 7:45 గంటల సమయంలో మూసాపేట్ నుంచి అమీన్‌పూర్ వెళ్తుండగా, కూకట్‌పల్లి జూనియర్ కళాశాల సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన బస్సు స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న జంగ్లి లక్ష్మి రోడ్డుపై పడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న ఆనంద్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ గడుపు కృష్ణ వాహనాన్ని అధిక వేగంతో, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్‌పై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



# ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు పెరుగుతాయి

## పాపి రెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

**కూకట్ పల్లి, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** ఇంకుడుగుంతల ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని రెయిన్బో పాఠశాలలో పాఠశాల కరెస్పాండంట్ విష్ణువర్ధన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలను, ఏబీ ఐ డిజిటల్ స్క్రీన్ ను చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు ఆర్ భగవంత రెడ్డి, ఏ ప్రభాకర్ రెడ్డి, కనక రెడ్డి, డి తిరుపతిరెడ్డి, పండు గౌడ్, జీ వసంత రెడ్డి, గోపాల్, హెచ్ రాజ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ తోపాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు పెరుగుతాయి

## పాపి రెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి




**కూకట్ పల్లి, జూలై 01 (క్రైమ్ మిర్రర్) :** ఇంకుడుగుంతల ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని రెయిన్బో పాఠశాలలో పాఠశాల కరెస్పాండంట్ విష్ణువర్ధన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలను, ఏబీ ఐ డిజిటల్ స్క్రీన్ ను చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు ఆర్ భగవంత రెడ్డి, ఏ ప్రభాకర్ రెడ్డి, కనక రెడ్డి, డి తిరుపతిరెడ్డి, పండు గౌడ్, జీ వసంత రెడ్డి, గోపాల్, హెచ్ రాజ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ తోపాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టెతస్కోప్‌తో చిన్నారి సీరియస్‌గా పరీక్ష

## నిజ డాక్టర్‌నే చెక్ చేసిన 'లిటిల్ డాక్టర్' ముచ్చటైన సన్నివేశం!

మిర్యాలగూడ, జూలై 1 (క్రైమ్ మిర్రర్): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శ్రీనివాస్‌నగర్‌లోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం ఓ ముచ్చటైన దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రీ-ప్రైమరీ చిన్నారులు పాల్గొన్న 'లిటిల్ డాక్టర్స్' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తెల్ల కోటు, స్టెతస్కోప్ ధరించిన ఓ చిన్నారి... అక్కడే ఉన్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాంబాబును "పరీక్ష" చేసిన తీరు హృదయాన్ని హత్తుకుంది. అత్యంత గంభీరంగా స్టెతస్కోప్‌తో గుండె చప్పుడు విన్న చిన్న డాక్టర్, చిరునవ్వుతో "డాక్టర్ గారు, మీ గుండె చప్పుళ్లు బాగున్నాయి" అని చెప్పడంతో అక్కడి వారంతా నవ్వులు చిందించారు. ఈ సమయంలో నర్స్ వేషధారణలో మరో చిన్నారి ఉత్సాహంగా గమనించగా, ఈ మధురమైన క్షణాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్లలో బంధించారు. చిన్నారి ప్రొఫెషనలిజాన్ని చూసి డాక్టర్ రాంబాబు కూడా ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే వైద్య వృత్తిపై ఆసక్తి పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం





## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

గండిపేట(క్రైం మిర్రర్): సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్ 122 డివిజన్‌లోకు చెందిన పోతురాజు జ్యోతికి 60 వేల చెక్కు, ఎలుగని మహేందర్‌కు 80 వేల రూపాయల చెక్కును, ప్రశాంత్‌నగర్‌కు చెందిన యాదుల్లకు 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ధరఖాస్తులు చేసుకున్న వెంటనే చెక్కులు మంజూరైయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరైన మెడికల్ పత్రాలు, బిల్లులు సమకూర్చి ధరఖాస్తు చేసుకుంటే వెంటవెంటనే నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అనేక మందికి సీఎం సహాయ నిధి ద్వారా నిధులు మంజూరు చేయించామన్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్యను మరింత పెంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, పాపయ్యయాదవ్, సయ్యద్ హుస్సేన్, నదీమ్, జగదీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రపురి కాలనీ సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు కీర్తిశేషులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి జయంతి వేడుకలు





**గండిపేట(క్రైం మిర్రర్):** చిత్రపురి కాలనీ సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు కీర్తిశేషులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి 91వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సతీమణి సంయుక్తప్రభాకర్‌రెడ్డి, ఆయన ఇద్దరు కుమార్తెలు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు సినీ ప్రముఖులు, సినీ కార్మికులు జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన సినీ రంగానికి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్తప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిత్రపురి కాలనీ ఏర్పాటుకు, అభివృద్ధికి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రస్తుతం ఐదు వేలకుపైగా కుటుంబాలు సంతోషంగా నివసిస్తున్నాయంటే అది ఆయన దూరదృష్టి, సేవాభావం వల్లేనని పేర్కొన్నారు. చిత్రపురి కాలనీలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేరును నిలబెట్టి, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వల్లభనేని అనిల్‌కుమార్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్మాని, నిజమైన సినీ కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే తనను పీఐసీ సభ్యురాలిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంయుక్తప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ వల్లభనేని హైమాంజలి, పిఐసి కమిటీ సభ్యులు రమేష్‌బాబు, మాజీ సెక్రటరీ దొరై, మాజీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# లక్షల ఖర్చు వృథా-సమస్యలు యథాతథం

### రవిపుడ్స్, ఆయిల్ కంపెనీ, ప్పు మిల్లు, విజయ్ ఆయిల్ మిల్, రామ్‌చరణ్ ఆయిల్ మిల్ వల్ల సమస్యలు

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్కమూరి విజయ్‌కుమార్



**గండిపేట(క్రైం మిర్రర్):** లక్షల ఖర్చు చేసి చేపడుతున్న పనులు వృథా అవుతూ సమస్యలు యథాతథంగా ఉంటున్నాయని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్కమూరి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజేంద్రనగర్‌నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఓల్డ్ కర్నూల్ రోడ్ ఈద డ్రై నేజీ పొంగి కాల్వ రూపంలో పోతున్నాయన్నారు. ఇండస్ట్రీయల్ ఏరియా నుంచి డ్రై నేజీ నీరు, కెమికల్ వ్యర్థజలాలు కలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి డ్రై నేజీ పనులు చేపట్టినా సమస్య మాత్రం యథాతథంగానే కొనసాగుతుందన్నారు. ఈ ప్రాంతంలో రవిపుడ్స్, బిస్కెట్ కంపెనీలు, ఆయిల్ కంపెఈలు, పప్పు మిల్లులు తదితర పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థజలాలు డ్రై నేజీలో కలపడం వల్ల సమస్య వస్తుందన్నారు. దుర్వాసన, కాలుష్యం పెరిగి స్థానిక ప్రజలు, కార్మికులు, వాహనాదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు.కార్మికులు తరుచూ శుభ్రపరిచే పనులు చేసినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదన్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కంపెనీ యజమానులు సంచరిస్తున్నప్పటికి ఈ సమస్య వారి దష్టికి రాకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు పరిశ్రమలతో కుమ్మకై ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అందువల్ల సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పరిశ్రమల యజమాన్యాలు వెంటనే స్పందించి డ్రై నేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.

## గణేష్‌నగర్‌లో ఎన్యూమరేషన్ ఫామ్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌కు సహకరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ గణేష్‌నగర్‌లో బిఎల్‌వోలతో కలిసి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్‌వోలతో మాట్లాడుతూ ప్రతి ఓటర్లకు విధిగా ఎస్ఐఆర్ పత్రాలు పంపిఆణీ చేయాలని క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే ఓటర్లకు కూడా ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ ఫామ్ నింపి దగ్గరలో ఉన్న బిఎల్‌వోలకు అందజేయాలన్నారు. ఇది చాలా అత్యంత ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఓటరు విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాస శ్రీనివాస్ నేత, సంజీవ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.





## బీఎస్పీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తాం: తాళ్ల జనార్దన్ గౌడ్

నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 01: బహుజన్ సమాజ్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్ల జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీఎస్పీ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బహుజన సిద్ధాంతాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లి బూత్ కమిటీలను బలోపేతం చేస్తామని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఎస్పీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు కుతాడి నర్సింలు, జిల్లా సీనియర్ నాయకులు డి. సిద్ధిరాములు, న్యాత మానయ్య, సారా రవి గౌడ్, నియోజకవర్గ నాయకులు గడ్డం రవి, పవన్ కుమార్, చారాలయ్య, డప్పు శంకర్, భిక్షపతి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలి

### సీనియర్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్



గండిపేట(క్రైం మిర్రర్): ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీనియర్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్ సూచించారు. కిస్మత్‌పూర్‌లోని సాయిబాబానగర్ కాలనీ, వినాయక్‌నగర్ కాలనీలలో కరెంటు సమస్యలపై బుధవారం ఏఈ మల్లేష్‌రాజ్, లైన్‌మెన్ కృష్ణ, నరేష్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన లేకుండా విద్యుత్ కోతలు జరుగుతున్నాయన్నారు. రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెదురుగా వెలాడుతున్న వైర్లలు ప్రమాదానికి కారణమవుతున్నాయన్నారు. ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా పక్కప్రణాళికతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సూర్యనారాయణ, మైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓవర్సీస విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 01:** సంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు 2027 సంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు టి. అఖిలేష్ రెడ్డి తెలిపారు.అభ్యర్థులు జూలై 1, 2026 నుంచి ఆగస్టు 31, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను http://telanganaepass.cgg.gov.in? వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని సూచించారు.పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఉప సంచాలకులు టి. అఖిలేష్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

## గంధంగూడలో ఎస్ఐఆర్ క్యాంప్

**గండిపేట(క్రైం మిర్రర్):** గంధంగూడలో ఎస్ఐఆర్ క్యాంప్ కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కటింగ్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్ హాజరై ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. వీలైనంత త్వరగా ఫామ్‌లను పూర్తి చేసి బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భోగాల శ్రీనివాస్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పట్టాలు వెంటనే ఇవ్వాలి

**రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా**




**గండిపేట(క్రైం మిర్రర్):** పేద ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ సీనియర్ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పేదలకుఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్తరించిందని తీవ్రంగా విమర్శించారు. సొంత ఇంటి కలతో వేలాది నిరుపేద కుటుంబాలు ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పాలకులకు చీమకుట్టినట్టూ లేదన్నారు. భూమిలేని పేదలకు వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు అందించాలని, పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి అర్హులకు అప్పగించాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదల హక్కుల సాధన కోసం పార్టీ నిరంతరం పోరాటం పచేస్తుందని



స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల సిపిఐ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహ్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.యాదగిరి, రియాజ్, శేరిలింగంపల్లి మండలం కార్యాదర్శి కె.చందుయాదవ్, శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రగిరి, గుండిపేట మండల కార్యదర్శి ఎన్.మల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్‌గౌడ్, భారత జాతీయ మహిళా సమైక్య రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె.విజయనంద్‌గౌడ్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్, రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాజా, ఏఐటియూసీ శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి గిలకరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌నాయక్, జి.సత్యం, జె.సదానంద్‌గౌడ్, శంకరయ్య, ఖాసీం, తుపాకుల రాములు, ఎస్.కొండలయ్య, జెట్టి శ్రీనివాస్, ఇ.నారాయణ, గంగారం తదితరులు పాల్గొన్నారు.




# వైద్యుల సేవలు వెలకట్టలేనివి

**ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం**

మిర్యాలగూడ, జూలై 1 (క్రైమ్ మిర్రర్): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ మండల పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో గల ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఆర్. గౌరి ముఖ్య అతిథి డా. రాంబాబును సన్మానించి స్వాగతం పలికారు.డా. రాంబాబు వైద్యుల సేవల ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులు ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కవితలు, నాటికలు, పాత్రధారణలతో ఆకట్టుకున్నారు. ప్రీ--ప్రైమరీ విద్యార్థులు 'లిటిల్ డాక్టర్స్' కార్యక్రమంలో పాల్గొన్నారు.న్యూట్రిషన్ వీక్‌లో భాగంగా ఆరోగ్యకర ఆహారం, కిచెన్ గార్డెన్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దివ్య హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ మచ్చ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్‌ల జన్మదిన వేడుకలు





**గండిపేట(క్రైం మిర్రర్):** భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నాంపూర్ సీనియర్ నాయకులు సీతారామ్ ధూళిపాళ, కుంభగల్ల ధనరాజుల జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పూల మాలలు, కేక్‌లు, శాలులతో ఘనంగా సన్మానించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. వృద్ధాశ్రమాల్లో, పురవీధి కూడళ్లల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తయాదవ్**







**గండిపేట(క్రైం మిర్రర్):** సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అవగాహన పెంచుకోని జాగ్రత్తగా ఉండాలని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తయాదవ్ అన్నారు. రాజేంద్రనగర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రేమావతిపేట గ్రామంలోని జై భీమ్ జై రామ్ సంఘంలో ప్రజలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన ముత్తుయాదవ్ ప్రజలకు పలు విషయాలను వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌రెడ్డి, సంఘం అధ్యక్షులు గోల్కొడ రాజుకుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, ఉపేందర్, లేవిరాజ్, చంద్రశేఖర్, సుమన్, జనార్ధన్, నాని, అనిల్, రాము, సునీల్, గౌతమ్, నవీన్, రాజు, సుదర్శన్, జి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా

**అవగాహన సమావేశం: సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**




గండిపేట(క్రైం మిర్రర్): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (సర్)లో రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమితులైన వారు బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలసి సమన్వయంగా ముందుకు సాగేటట్లు రాజకీయ పార్టీల నాయకులు సూచనలు చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అథారిటీ (ఈ ఆర్ ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం లో 44% మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి నగరంలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం సర్ కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలిచిందని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు . నియోజకవర్గంలో ఆరు లక్షల 35 వేల పైచిలుకు ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు రెండు లక్షల 70వేల పైచిలుకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడం జరిగిందన్నారు . రాజకీయ పార్టీల తరపున నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు కొన్ని చెట్ల బీఎల్ఓ లకు సహకరిస్తున్నారని, మిగతా చోట్ల వారు పట్టించుకోవడంలేదని వాదన లు వినిపిస్తున్నాయన్నారు. అలా కాకుండా ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఏజెంట్లు బూతు లెవల్ ఆఫీసర్లకు సహకరించి ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వారు పూర్తి చేసి తిరిగి ఇచ్చేవరకు కలసి పనిచేయాలన్నారు.

**ప్రతి బూత్ లో ఓటర్ల వివరాలు ఖచ్చితంగా తెలుసుకోవాలి...**

ప్రతి బూత్ లో మరణించిన ఓట్ల వివరాలు, ఇండ్లు షిఫ్ట్ చేసిన వారి వివరాలు తెలుసుకొని వారి ఇక్కడ లేరనే నిర్ధారణ అయ్యాక బీ ఎల్ ఓ లు, బీ ఎల్ ఏ లు సంతకాలు చేసి ఇవ్వడం ద్వారా లేని ఓట్ల ను గుర్తించడం జరుగుతుందన్నారు. అలా చేయడం ద్వారా ఏలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు.

**పోటో లు పెట్టి తిరిగి ఇవ్వాలి..**

ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకున్న ఓటర్లు 2002 లో ఎక్కడ ఓటు వేశారు... వారి ఓటరు కార్డు నెంబరు, ఆధార్ కార్డు నెంబరు రాసి పోటో అతికించి తిరిగి బీ ఎల్ ఓ లకు ఇవ్వాలన్నారు. వీటన్నిటి విషయంలో రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. సమీక్ష సమావేశం లో ఏ ఈ ఆర్ ఓ లు మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, రాములు లతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మణికొండ, నెక్నాంపూర్ డివిజన్‌లో ఇంటింటికీ చేరుతున్న ఎస్ఐఆర్ ఫారాలు

**ఓటర్లకు బీఎల్వోల సేవలు**



**గండిపేట(క్రైం మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ నెక్నంపూర్ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) నిత్యం ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీరామనగర్ కాలనీలో బీఎల్వోలు ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేస్తూ, వాటిని ఎలా పూరించాలి, ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మనికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణా రెడ్డి, బీజేపీ నాయకులు కంకణాల శివరాంరెడ్డి, బీఎల్వో సందీప్ కుమార్ తదితరులు పాల్గొని బీఎల్వోల సేవలను అభినందించారు. ప్రజలందరూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని వారు కోరారు.

# సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేనిని పరామర్శించిన పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్

**కామ్రేడ్ తమ్మినేని వంటి నిఖార్సైన కమ్యూనిస్టు సేవలు దేశానికి అవసరం**

**పూర్తి ఆరోగ్యంతో మరో మహా పాదయాత్ర చేపట్టాలి**



మహిళా నాయకులు బండి పద్మ,మాచర్ల భారతి, రూరల్ మండల కమిటీ సభ్యులు తెల్దార్ పల్లి మద్దులపల్లి తల్లంపాడు మల్లేపల్లి పొన్నేకల్ నాయుడుపేట గ్రామాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దార్ పల్లి గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కమ్యూనిస్ట్ సీనియర్ నాయకులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రంను సిపిఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు కామ్రేడ్ బృందా కారత్ పరామర్శించారు..సిపిఎం పార్టీ ఉక్కు మహిళ, పొలిట్ బ్యూరో సభ్యురాలు కామ్రేడ్ బృందా కారత్ వంటి అగ్రశ్రేణి నాయకురాలిని ప్రత్యక్షంగా చూసిన పార్టీ శ్రేణులు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ్మినేని వంటి చురుకైన నిఖార్సైన కమ్యూనిస్ట్ నాయకుడు దేశానికి చాలా అవసరం అని తన ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపైనే ఉంటాయని ప్రస్తుతం విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం కుదుటపడ్డాక ప్రజా సమస్యలపై మరో మహా పాదయాత్ర నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఆప్యాయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, తమ్మినేని వెంకట్రావు,

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.